క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో లక్ష్మీ గణపతి, సుదర్శన హోమాలు

అమలాపురం రూరల్: బండారులంక బిళ్లవారి వీధిలో వేంచేసియున్న పద్మావతి, అలివేలు మంగా సమేత వేంకటేశ్వర స్వామి కల్యాణ మహోత్సవంలో భాగంగా సోమవారం లక్ష్మీ గణపతి, సుదర్శన హోమాలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ప్రత్యేకంగా తయారు చేసిన హోమ గుండంలో 11 మంది దంపతులు బ్రహ్మశ్రీ కారుపర్తి మల్లేశ్వరరావు శిష్య బృందం అర్చకత్వంలో ఈ హోమకృతువు నిర్వహించారు. కార్యక్రమంలో కార్యదర్శి శ్రీనివాస్, ఎంపీటీసీ అంకం హిమ భారతి, ఉప్పుగంటి భాస్కరరావు పాల్గొన్నారు. స్వామి అమ్మవార్ల పవళింపు సేవను ఆదివారం రాత్రి సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. అనంతరం స్వామి, అమ్మ వార్లకు ఊంజల్ సేవ నిర్వహించారు. శ్రీనివాస బాలమిత్ర సంఘ ప్రతినిధులు చింతపట్ల బాబు, బళ్ల సత్తిరాజు, లక్కింశెట్టి ఫణి రాజు పాల్గొన్నారు.

ఐ. పోలవరం ఎస్సైగా రవీంద్రబాబు



ఐ.పోలవరం: ఇటీవల చేపట్టిన బదిలీల నేపథ్యంలో ఐ. పోలవరం ఎస్సైగా ఎం.రవీంద్రబాబు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇంత వరకు ఇక్కడ ఎస్సైగా పనిచేస్తున్న మల్లికార్జున్ రెడ్డి అమలాపురం మహిళా పోలీస్‌స్టేషన్‌కు బదిలీ కావడంతో ఆయన స్థానంలో రవీంద్రబాబు నియమితులయ్యారు. రవీంద్రబాబు కాకినాడ జిల్లా తిమ్మాపురం ఎస్సైగా పనిచేస్తూ బదిలీపై కోనసీమ జిల్లా ఐ.పోలవరం ఎస్సైగా బాధ్యతలు స్వీకరించారు.

బుద్ధుని బోధనలు సమ సమాజానికి దోహదం

తాళ్లరేవు: కుల, మత, ఆర్థిక అంతరాలు కలిగిన నేటి సమాజంలో బుద్ధుని బోధనలు సమ సమాజానికి దోహదం చేస్తాయని ప్రముఖ వైద్యుడు జవహర్ అన్నారు. నీలపల్లిలో బుద్ధిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో సోమవారం వైశాఖ పౌర్ణమి సందర్భంగా బుద్ధ జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో జవహర్ మాట్లాడుతూ విలాసవంతమైన సౌకర్యాలు కలిగిన రాజకుటుంబంలో పుట్టిన బుద్ధుడు జ్ఞానం పొందిన తరువాత వాటన్నింటినీ వదిలివేసి అనేక బోధనలు చేసారన్నారు. బుద్ధుని బోధనలను అంబేడ్కర్ అనుసరించారని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ యువకులు, మహిళలు, పలువురు బుద్ధిస్టులు పాల్గొన్నారు.

సారా తయారీ, విక్రయం చట్ట విరుద్ధం

అమలాపురం రూరల్: సారా రహిత ఆంధ్రప్రదేశ్ కార్యక్రమంలో భాగంగా నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా కామనగరువు, రెడ్డిపల్లి, తాండవపల్లిలో సోమవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. నాటు సారా తయారీ, విక్రయం చట్ట విరుద్ధమని, సారా తాగడం వల్ల ఆరోగ్యానికి హాని కలుగుతుందని వివరిస్తూ అమలాపురం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ అధికారులు ర్యాలీ నిర్వహించారు. ప్రచారం రథం ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ సీఐ వీటీవీవీ సత్యనారాయణ గ్రామ పెద్దలు, ప్రజలు, సచివాలయం ఉద్యోగులు, అధికారులు పాల్గొన్నారు.

వంతెనల నిర్మాణానికి శంకుస్థాపన

అమలాపురం రూరల్: అమలాపురం నుంచి బొబ్బర్లంక రహదారిలో ఈదరపల్లిలో, ముక్కామల లాకు రహదారిలో నడిపూడి సమీపంలో నక్కవారిపేట వద్ద వంతెల నిర్మాణాలకు సోమవారం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు శుంకుస్థాపన చేశారు. నాలుగు కోట్లతో చేపట్టే ఈ పనులు రహదారులు, భవనాల శాఖ తొమ్మిది నెలల్లో పూర్తిచేస్తుందని, మరో అయిదు వంతెనల నిర్మాణం వచ్చే ఏడాది చేపడతామని ఎమ్మెల్యే ఆనందరావు తెలిపారు. అమలాపురంలో రహదారులు 63 అడుగులమేర వెడల్పు చేయడానికి రూ.80 కోట్ల నిధులు అవసరమని, నిధులు మంజూరు కాగానే పనులు ప్రారంభిస్తామని తెలిపారు. ఎంపీ హరీష్ మాధుర్ మాట్లాడుతూ అమలాపురం అభివృద్ధిలో తన వంతు కృషి చేస్తానని అన్నారు.ఈ కార్యక్రమంలో ఆర్డీవో కె.మాధవి, అమ్ముడా చైర్మన్ అల్లాడ స్వామినాయుడు, మెట్ల రమణబాబు, డీసీఎంఎస్ చైర్మన్ పెచ్చెట్టి చంద్రమౌళి, రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ సత్తిబాబురాజు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు అడబాల సత్య నారాయణ, పొలమూరి ధర్మపాల్, మాజీ ఎంపీపీ బొర్రా ఈశ్వరరావు, మాజీ జెడ్పీటీసీ అధికారి జయవెంకటలక్ష్మి, కల్వకొలను తాతాజీ పాల్గొన్నారు.

సన్‌షేడ్ కూలి బాలిక దుర్మరణం

తాళ్లరేవు: వేసవి సెలవులకు బంధువుల ఇంటికి వచ్చిన ఓ చిన్నారి ప్రమాదవశాత్తూ మృతి చెందిన ఘటన మండల పరిధిలోని సుంకరపాలెం గ్రామంలో సోమవారం జరిగింది. కోరంగి ఎస్సై పి.సత్యనారాయణ తెలిపిన వివరాల మేరకు గుంటూరుకు చెందిన షేక్ ఖలీల్ భార్య, పిల్లలు వేసవి సెలవులకు సుంకరపాలెం వచ్చారు. స్థానిక మసీదు వద్ద పిల్లలు ఆడుకుంటుండగా ఒక్కసారిగా భవనం సన్‌షేడ్ కూలడంతో బాలిక షేక్ సునీరా (9)కు తీవ్రగాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు హుటాహుటిన యానాం ప్రభుత్వాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ సునీరా మృతి చెందింది. బాలిక తల్లి ఖాదిర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై తెలిపారు.

పంట కాలువల్లో పూడికలు

- పేరుకుపోయిన మట్టి దిబ్బలు
- నీటి ప్రవాహాన్ని అడ్డుకుంటున్న వైనం
- ప్లాస్టిక్ వ్యర్థాలతో డంపింగ్‌యార్డులను తలపిస్తున్న కాలువలు
- ఆధునీకరణను పట్టించుకోని అధికారులు



గోపాయిలంక వద్ద అల్లవరం ప్రధాన కాలువలో పేరుకుపోయిన మట్టి దిబ్బ



బోడసకుర్రులో కాలువకు అడ్డుగా ఉన్న మట్టికట్ట

అల్లవరం: డెల్టా ప్రజలకు ఆరాధ్యుడైన సర్ ఆర్థర్ కాటన్ మహాశయుని కృషితో తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల్లోని భూముల్లో మూడు పంటలు పండేలా శివారు ప్రాంతాలకు సైతం ప్రతి ఎకరానికి సాగునీరు అందేలా పక్కా ప్రణాళికతో కాలువలు నిర్మించారు. ఆ మహాశయుని కృషి ఫలితంగా నేడు లక్షలాది ఎకరాల్లో మూడు పంటలు పండుతున్నాయి. అయితే ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న సాగునీటిని ఆనకట్టల ద్వారా నీటిని నిల్వ చేసి అక్కడి నుంచి శివారు ప్రాంతాల ప్రజలకు తాగునీరు, వ్యవసాయ అవసరాలకు పంపిణీ చేసే కాలువలు నేడు నిర్లక్ష్యానికి గురవుతున్నాయి. కాలువల్లో ఎక్కడ చూసినా మట్టి దిబ్బలే దర్శనమిస్తున్నాయి. ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న నీటిలో చెత్త, చెదారం, మట్టి కలిసిపోయి నీటి ప్రవాహాన్ని నియంత్రించే చెక్ డ్యామ్‌ల వద్ద మట్టి టన్నుల కొద్దీ పేరుకుపోతోంది. ఇలా పేరుకుపోయిన మట్టి కారణంగా శివారు ప్రాంతాలకు సాగునీటి సరఫరాకు ఆటంకం ఏర్పడుతోంది. దీంతో నీటి ప్రవాహం తగ్గిపోయి శివారు ప్రాంతాలకు దాళ్లలో నీటి ఎద్దడి చోటు చేసుకుంటోంది.

చెక్ డ్యామ్‌ల వద్ద పరిస్థితి మరీ అధ్వానం

చెక్ డ్యామ్‌ల వద్ద కొండలా పేరుకుపోయిన మట్టి దిబ్బలను తొలగించకుండా ఇరిగేషన్ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. కాలువలపై విధులు నిర్వర్తించే లస్కర్లు చెత్త చెదారాన్ని తొలగించడంలో విఫలమవుతున్నారు. కాలువల్లో అడ్డకట్టలు, నీటి ప్రవాహానికి ఏర్పడిన మట్టి దిబ్బలు, భారీగా పేరుకుపోయిన పూడికను తొలగించకపోవడంతో శివారు ప్రాంతాలకు నీరు చేరడం గగనంగా మారింది. అల్లవరం ప్రధానం కాలువ గోపాయిలంక వద్ద కాలువలో భారీగా మట్టి పేరుకుపోయింది. దీంతో శివారు ప్రాంతాలకు నీరు పూర్తిస్థాయిలో రావడం లేదు. బోడసకుర్రు కాలువకు అడ్డుగా ఉన్న మట్టికట్టతో బెండా కాలువ, అల్లవరం కాలువలకు నీరు ఆశించినస్థాయిలో రావడం లేదు. సమనస లాకు వద్ద భారీగా మట్టి దిబ్బలు పేరుకుపోయాయి. నడిపూడి లాకు నుంచి ఎర్రవంతెన వరకు వంతెనల వద్ద భారీగా పూడిక చేరుకుంది. ఉపాధి పథకం ఆచరణలోకి వచ్చిన తర్వాత ప్రధాన కాలువలు, సబ్ కెనాల్స్‌ను ఆధునీకరించడం అధికారులు పూర్తిగా మరిచిపోయారు.

అమలాపురం నియోజకవర్గంలో ప్రధాన మండలాలైన అమలాపురం రూరల్, అల్లవరం, ఉప్పలగుప్తం మండలాల్లోని ప్రధాన కాలువలను రెండు దశాబ్దాలుగా ఆధునీకరణకు నోచుకోలేదు. భారీ వర్షాలకు ముంపు ఏర్పడితే మాత్రం కాలువలో గుర్రపు డెక్క, తూటు తొలగించి ఇరిగేషన్ అధికారులు చేతులు దులుపుకుంటున్నారు. కాలువల పొడవునా ఆక్రమణలు, వంతెనలు వెలుస్తున్నాయి. ఏ ఒక్క అధికారి ఇది ఏమిటని ప్రశ్నించరు. ఆక్రమణలతో కాలువలు మూసుకుపోయినా పట్టించుకోరు. ఇక ఆక్రమణదారులు వారి ఇష్టానుసారంగా కాలువలను ఆక్రమించుకుని భవనాలు, షాపులు, ఇళ్లు నిర్మిస్తున్నారని శివారు ప్రాంత రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఇరిగేషన్ అధికారులు స్పందించి కాలువల్లో పేరుకుపోయిన మట్టి దిబ్బలను తొలగించి, కాలువల పొడవునా ఆక్రమణలు తొలగించాలని రైతులు కోరుతున్నారు.

కాలువల నిండా ప్లాస్టిక్ వ్యర్థాలే



కాలువల్లో అడుగు పెట్టలేనంతంగా సీసాలు, ప్లాస్టిక్ వస్తువులు దర్శనమిస్తున్నాయి. ఇవి మట్టిలో కూరుకుపోతున్నాయి. కాలువల్లో పూడిక భారీగా పేరుకుపోయింది. దీని వల్ల శివారు పంట పొలాలకు సాగునీరు చేరడం లేదు. కాలువల పొడవునా విపరీతంగా ఆక్రమణలు పెరిగిపోయాయి. ఆక్రమణలు తొలగించి కాలువలను విస్తరిస్తే శివారు ప్రాంతాలకు పూర్తిస్థాయిలో సాగు నీరు చేరుతుంది.

– బొక్కా శ్రీను, రైతు నాయకుడు, అల్లవరం

వీర జవాన్ మురళీనాయక్‌కు ఘన నివాళి



వీర జవాన్ మురళీనాయక్ చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న సూర్యనారాయణమూర్తి తదితరులు

అమలాపురం టౌన్: భారత్, పాకిస్థాన్ మధ్య జరుగుతున్న సిందూర్ ఆపరేషన్ యుద్ధంలో అమరుడైన వీర జవాన్ మురళీనాయక్‌కు వర్కర్స్ పార్టీ ఆఫ్ ఇండియా జిల్లా శాఖ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో ఘన నివాళులర్పించారు. రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు దేవాదుల సూర్యనారాయణమూర్తి, పార్టీ నాయకులు, కార్యకర్తల ఆధ్వర్యంలో తొలుత వీర జవాన్ మురళీనాయక్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పితాని బేబీరావు, గున్నేపల్లి భీమశంకరం, కొనుకు వెంకటేశ్వరరావు తదితరులు వీర జవాన్ చిత్ర పటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు.

తప్పుడు కేసులతో ప్రజాదరణ ఆపలేరు



కె.బాలమునికుమారి

ముమ్మిడివరం: సీఎం చంద్రబాబునాయుడు రాజకీయ కక్షతో వైఎస్సార్ సీపీ శ్రేణులపై తప్పుడు కేసులు బనాయిస్తూ దౌర్జన్యం చేస్తూ అక్రమ అరెస్టులు చేయిస్తున్నారని ఆపార్టీ కోనసీమ జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు కాశి బాలమునికుమారి ఆరోపించారు.ఆమె సోమవారం ముమ్మిడివరంలో మాట్లాడుతూ ఇటీవల గుంటూరు జిల్లా తాడికొండ మండల కంతేరు గ్రామ ఎంపీటీసీ సభ్యురాలు, దళిత మహిళ వలపర్ల కల్పనను అర్ధరాత్రి చట్ట విరుద్ధంగా అరెస్టు చేసి ఆమె పట్ల దురుసుగా ప్రవర్తించడం దారుణమన్నారు. మాజీ మంత్రి అని మర్యాద లేకుండా విడదల రజనీపై సీఐ సుబ్బనాయుడు విచక్షణారహితంగా దౌర్జన్యంగా దురుసుగా ప్రవర్తించడం దారుణమన్నారు. పోలీసులు కూటమి ప్రభుత్వ కార్యకర్తలుగా వ్యవహరిస్తున్నారని బాలమునికుమారి ఆరోపించారు. ఎన్నికల హామీలు అమలు చేయకుండా వైఎస్సార్ సీపీ నాయకులపై బురద జల్లుతూ డైవర్షన్ రాజకీయాలతో చంద్రబాబు కాలం వెళ్లదీస్తున్నారని మునికుమారి విమర్శించారు.

వీరేశ్వరస్వామి ఆలయంలో చండీహోమం



వీరేశ్వరస్వామి ఆలయంలో చండీహోమం నిర్వహిస్తున్న అర్చకులు

ఐ.పోలవరం: వైశాఖ మాసం పౌర్ణమి సోమవారం మహా పర్వదినం పురస్కరించుకుని మురమళ్ల వీరేశ్వరస్వామి ఆలయంలో చండీహోమం ఘనంగా నిర్వహించారు. అర్చకులు బ్రహ్మశ్రీ పేటేటి శ్యామలకుమార్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. తొలుత గణపతి పూజ, మండపారాధన అనంతరం చండీహోమం, పూర్ణాహుతి నిర్వహించారు. ప్రతి నెలా పౌర్ణమి తిథికి భక్తుల గోత్రనామాలతో దేవస్థానం తరపున చండీహోమం నిర్వహిస్తారు. 109 మంది భక్తులు చండీహోమంలో పాల్గొన్నారు. ఆలయ సహాయ కమిషనర్, కార్యనిర్వహణాధికారి శ్రీ మాచిరాజు లక్ష్మీనారాయణ ఏర్పాట్లు పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో ఆకొండి కిరణ్ తదితరులు పాల్గొన్నారు. వీరేశ్వరస్వామి అన్నదాన ట్రస్టుకు సోమవారం విజయవాడకు చెందిన బొల్లా జ్యోతి రూ.10,116 విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ పర్యవేక్షణాధికారి శ్రీనివాసరాజు దాతలకు స్వామి వారి చిత్రపటం, శేష వస్త్రం, ప్రసాదం అందించి సత్కరించారు. ఆలయ అర్చకులు బ్రహ్మశ్రీ పేటేటి శ్యామల కుమార్ ఆధ్వర్యంలో దాతలకు ప్రత్యేక దర్శనం కల్పించారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు అధికారుల గైర్హాజరు



మండలస్థాయి గ్రీవెన్స్‌లో అర్జీ అందిస్తున్న సర్పంచ్ ఊర్మిళాదేవి తదితరులు

ఉప్పలగుప్తం: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదికకు మండలంలోని ప్రధాన శాఖల అధికారులు గైర్హాజరయ్యారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంటకు వరకూ ఈ కార్యక్రమం కొనసాగించాల్సి ఉంది. ఈ సందర్భంగా కొన్ని శాఖలకు సంబంధించి కింది స్థాయి ఉద్యోగులకు అర్జీలు స్వీకరించే బాధ్యతలు అప్పగించారు. సమస్యలపై అర్జీ అందించడానికి వచ్చిన విలసవిల్లి సర్పంచ్ సలాది ఊర్మిళాదేవి, వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు సలాది సతీష్, ఉప్పలగుప్తం గ్రామ టీడీపీ నాయకుడు మేకా రామారావు చౌదరి వారిపై తీవ్రంగా మడిపడ్డారు. ప్రజలు తమ సమస్యలను విన్నవించేందుకు వస్తుంటే మండల స్థాయి అధికారులు గైర్హాజరవడం ఏమిటని వారు ప్రశ్నించారు. విలసవిల్లికి వర్షాకాలంలో విద్యుత్ సరఫరాలో అంతరాయంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని విద్యుత్ శాఖ జేఈ కుప్పాల వెంకటేశ్వరావుకు గ్రామస్తులు అర్జీ అందించారు. గొల్లవిల్లి నుంచి భీమనపల్లి పంచాయతీ పరిధి సూదాపాలెం మీదుగా వస్తున్న విద్యుత్ లైనును అమలాపురం మండలం నుంచి వచ్చే విద్యుత్ లైన్‌కు జత చేసి విలసవిల్లికి విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని వారు కోరారు. అవసరమైతే గ్రామ పంచాయతీ నుంచి తమ వంతుగా సహకరిస్తామని వివరించారు.

ముత్యాలమ్మకు భక్తిశ్రద్ధలతో క్షీరాభిషేకం



పి.మల్లవరం ముత్యాలమ్మవారి క్షీరాభిషేకంలో పాల్గొన్న భక్తులు

తాళ్లరేవు: కోరిన కోర్కెలు తీర్చే కొంగుబంగారంగా విరాజిల్లుతున్న పి.మల్లవరం గ్రామ దేవత ముత్యాలమ్మ వారికి సోమవారం క్షీరాభిషేకం కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పవిత్ర వైశాఖ పౌర్ణమి సందర్భంగా ఆలయ అర్చకులు ఖండవిల్లి సత్య శ్రీనివాసాచార్యులు(చిన్న) నేతృత్వంలో అమ్మవారికి కట్టా దుర్గాప్రసాద్, శ్యామల దంపతులతో క్షీరాభిషేకం, ప్రత్యేక కుంకుమ పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ విళ్ల సత్యనారాయణ మాట్లాడుతూ ప్రతి పౌర్ణమికి అమ్మవారికి క్షీరాభిషేకాన్ని ఘనంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ముత్యాలమ్మ అమ్మవారితోపాటు పరదేశమ్మ అమ్మవారు ఉంటారని, అదే విధంగా గ్రామంలో ఎక్కువగా అక్కాచెల్లెళ్లు కోడల్లుగా వస్తారని తెలిపారు. సుమారు 60 మంది అక్కాచెల్లెళ్లు తమ గ్రామానికి కోడళ్లుగా వచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ కోశాధికారి పితాని వీరబాబు, ప్రతినిధులు ధూళిపూడి సుభ, కట్టా సత్యనారాయణ, డి.నాగేంద్రప్రసాద్, సుబ్బారావు, విఘ్నేశ్వరరావు, వీరబాబు పాల్గొన్నారు.

నర్సుల సేవలు ప్రశంసనీయం



అమలాపురంలో నర్సులను సత్కరిస్తున్న వాకర్స్ హెల్త్ క్లబ్ ప్రతినిధులు

అమలాపురం టౌన్: సేవా తత్పరతకు నిలువెత్తు మానవ రూపం నర్సులని, మానవతను చాటుతూ, రోగులకు ధైర్యాన్నిచ్చి వారు త్వరగా కోలుకునేలా నర్సులు అందించే సేవలు ప్రశంసనీయమని అమలాపురం వాకర్స్ హెల్త్ క్లబ్ అధ్యక్షుడు బోణం సత్య వరప్రసాద్ అన్నారు. అంతర్జాతీయ నర్సుల దినోత్సవం సందర్భంగా వాకర్స్ హెల్త్ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక మెడ్ యునైటెడ్ హాస్పిటల్‌లో 25 మంది నర్సులకు సోమవారం సాయంత్రం నిర్వహించిన కార్యక్రమంలో సత్యవరప్రసాద్ మాట్లాడారు. ఇటలీలో ఓ సంపన్న కుటుంబంలో 1812 మే 12న జన్మించిన ఫ్లోరెన్స్ నైటింగేల్ నర్సు వృత్తిని ఎంచుకుని ఎంతో మందికి సేవలు చేసి గొప్ప మానవతావాదిగా గుర్తింపు పొందారని చెప్పారు. అప్పటి నుంచి ఏటా మే 12న నర్సుల దినోత్సవం జరుపుకుంటూ వారి సేవలను మననం చేసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో వాకర్స్ అంతర్జాతీయ ఉపాధ్యక్షుడు ప్రొఫెసర్ గోకరకొండ నాగేంద్ర, వాకర్స్ గవర్నర్ సప్పా నాగేశ్వరరావు, వాకర్స్ క్లబ్ ప్రతినిధులు పడాల నాయుడు, గోటేటి గంగాధర్, నూకల సత్యనారాయణ, పుత్సా కృష్ణ కామేశ్వర్, చింతలపూడి సత్తిబాబు, కుడుపూడి త్రినాథ్ తదితరులు 25 మంది నర్సులను సత్కరించి వారికి శుభాకాంక్షలు తెలిపారు.

బాస్కెట్‌బాల్ పోటీ విజేతలకు అభినందన



ఉమ్మడి జిల్లా బాస్కెట్ బాల్ క్రీడాకారిణులను అభినందిస్తున్న ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు

అమలాపురం టౌన్: రామచంద్రపురంలో ఈనెల 11న నిర్వహించిన అండర్–23 పురుషులు, మహిళల ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బాస్కెట్ బాల్ చాంపియన్ షిప్ పోటీల్లో విజేతలుగా నిలిచిన అమలాపురానికి చెందిన క్రీడాకారులను ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు సోమవారం అభినందించారు. స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల క్రీడాస్థలంలో ఏర్పాటు చేసిన వేసవి ఉచిత బాస్కెట్ బాల్ శిక్షణ శిబిరంలో ఎమ్మెల్సీని ఉమ్మడి జిల్లా బాస్కెట్‌బాల్ క్రీడా పోటీల విజేతలు కలిశారు. ఈ పోటీల్లో సత్తా చాటిన అమలాపురానికి చెందిన సీహెచ్ రేవతి, బి.జయ, టి.అక్షిత, ఎ.శిరీష ఉమ్మడి జిల్లాస్థాయిలో తృతీయ స్థానాన్ని సాధించారు. మహిళా విభాగం విజేతలైన నలుగురు క్రీడాకారిణిలు ఎమ్మెల్సీని కలిసి తమ విజయాన్ని వివరించారు. జాతీయ మాజీ బాస్కెట్ బాల్ క్రీడాకారుడైన ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు విజేతకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో బాస్కెట్ బాల్ కోచ్ ఆకుల ఉమా మహేశ్వరరావు, క్రీడాభిమానులు చప్పిడి శోభన్‌బాబు, మెహబూబ్ షకీలా, ముంగర ప్రసాద్ పాల్గొన్నారు.

వైభవంగా రమా సత్యనారాయణ కల్యాణం

అమలాపురం రూరల్: సవరప్పాలెంలో రమా సత్యనారాయణ స్వామి, ఆదిత్య అంబికా సమేత విశ్వేశ్వర గణపతి, విష్ణువు కొలువైన ఆలయంలో రమా సత్యనారాయణ స్వామి, అంబికా విశ్వేశ్వర స్వామి వార్ల కల్యాణ మహోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. వైశాఖ పౌర్ణమి సందర్భంగా సోమవారం స్వామి, అమ్మవార్లకు చక్రస్నానం, త్రిశూల స్నానం కార్యక్రమాలు ఆలయ అర్చకులు దొంతుకుర్తి శ్రీనివాస శాస్త్రి ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సత్తి చిన్న తమ్మన్న కుటుంబీకులు 800 మందికి అన్నప్రసాద వితరణ చేశారు. గోదావరి ప్రాజెక్ట్ కమిటీ ఉపాధ్యక్షుడు సత్తి వెంకటరత్నం, కౌన్సిలర్ పడాల శ్రీదేవి, చిందడగరువు ఎంపీటీసీ మోటూరి కనకదుర్గ వెంకటేశ్వరరావు దంపతులు, సత్తి బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కన్నుల పండువగా దీపోత్సవం

తాళ్లరేవు: స్థానిక ప్రధాన రహదారిలో వేంచేసియున్న భూసమేత వేంకటేశ్వరస్వామి 34వ వార్షిక కల్యాణోత్సవాల్లో భాగంగా స్వామివారికి సోమవారం రాత్రి దీపోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు.

వైభవంగా తెప్పోత్సవం

తాళ్లరేవు వద్ద కేశవపురంలో వేంచేసియున్న శ్రీదేవి, భూదేవి సమేత కేశవస్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా సోమవారం తెప్పోత్సవం కన్నుల పండువగా నిర్వహించారు. ఆలయ ఈఓ యర్రా వెంకటేశ్వరరావు పర్యవేక్షణలో నిర్వహిస్తున్న కల్యాణోత్సవాల్లో భాగంగా ఐదవరోజున స్వామివారికి స్థానిక ఆత్రేయ గోదావరిలో తెప్పోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.

ఆత్మీయ సమ్మేళనంలో పూర్వ విద్యార్థుల సందడి



యానాం చిల్డ్రన్స్ ఆడిటోరియంలో కలసిన పూర్వ విద్యార్థులతో ఉపాధ్యాయులు

యానాం: యానాం రాజీవ్‌గాంధీ ప్రభుత్వ ఇంగ్లిషు మీడియం హైస్కూల్లో సోమవారం 2014లో పదవ తరగతి చదువుకున్న పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఉత్సాహంగా, ఆనందోత్సాహాల మధ్య నిర్వహించారు. ఈ సందర్భంగా 11 ఏళ్ల క్రితం తమకు చదువులు చెప్పి విజ్ఞానవంతులను చేసి ఉన్నతులుగా తీర్చిదిద్దిన ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. దేశ, విదేశాల్లో స్థిరపడిన విద్యార్థులంతా వారు స్థిరపడిన వృత్తి, ఉద్యోగ, వ్యాపార వివరాలను ఉపాధ్యాయులకు వివరించారు. చాలా ఏళ్ల తర్వాత తాము చదువుకున్న పాఠశాలలో బాల్య స్నేహితులంతా కలిశామని వారు సంతోషం వ్యక్తం చేస్తూ సందడి చేశారు. స్థానిక చిల్డ్రన్స్ ఆడిటోరియంలో వివిధ కార్యక్రమాలను నిర్వహించారు.

ప్రభుత్వం ప్రతిపాదించిన ప్రదేశంలోనే వంతెన నిర్మించాలి



తహసీల్దార్ వద్ద నిరసన తెలుపుతున్న నక్కావారిపేట వాసులు

అమలాపురం రూరల్: బండారులంక నక్కావారిపేటలో రూ.2 కోట్లతో వంతెన నిర్మాణానికి జిల్లా కలెక్టర్ మహేష్‌కుమార్, ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు ప్రతిపాదించిన ప్రదేశంలో కాంట్రాక్టర్ సుమారు రూ.10 లక్షలతో వారం రోజులుగా పనులు ప్రారంభించారు. బండారులంక మాజీ సర్పంచ్ బడుగు సత్యనారాయణ తదితరులు అభ్యంతరం వ్యక్తం చేయడంతో వంతెన అలైన్‌మెంట్ మార్చి వేరే ప్రాంతంలో వంతెన నిర్మాణానికి అధికారులు ప్రయత్నిస్తున్నారని పలువురు ఆరోపించారు. అక్కడ ప్రజలు ఏర్పాటు చేసుకున్న అంబేడ్కర్ విగ్రహాన్ని అధికార పార్టీ అండతో తరలించేందుకు ప్రయత్నిస్తున్నారని స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ప్రతిపాదించిన స్థలంలోనే వంతెన నిర్మించాలని స్థానికులు తెలిపారు. ఎమ్మెల్యే అనందరావు పోలీస్ బందోబస్తుతో వంతెన నిర్మాణానికి భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు.

మాజీ సర్పంచ్‌పై డీఆర్‌ఓకు ఫిర్యాదు

మాజీ సర్పంచ్ సత్యనారాయణపై నక్కావారిపేట వాసులు కలెక్టర్ కార్యాలయంలో జిల్లా రెవెన్యూ అధికారి రాజకుమారికి సోమవారం ఫిర్యాదు చేశారు. ప్రభుత్వం ప్రతిపాదించిన ప్రదేశంలో వంతెన నిర్మాణం చేపట్టకుండా అంబేడ్కర్ విగ్రహం తొలగించి వంతెన నిర్మాణం పనులు చేపట్టాలని మాజీ సర్పంచ్ సత్యనారాయణ ప్రయత్నిస్తున్నారని కుంచే శాంతి, కుంచే కళాధర్, నక్కా పాపారావు, మాకే సాయిబాబా, నక్కా శ్రీను తదితరులు డీఆర్‌ఓకు ఫిర్యాదు చేశారు. రోడ్డుకు ఇరువైపులా ప్రభుత్వ స్థలాలను ఆక్రమిస్తున్న వ్యక్తులకు మాజీ సర్పంచ్ వత్తాసు పలుకుతున్నాడని ఫిర్యాదు చేశారు. ప్రభుత్వం ఇచ్చిన అలైన్‌మెంట్‌లో వంతెన నిర్మాణం చేపట్టి, రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఆక్రమలు తొలగించాలని కాలనీవాసులు డిమాండ్ చేశారు. దీనిపై తహసీల్దార్ పి.పలివెల అశోక్ ప్రసాద్ ఘటన స్థలాన్ని సందర్శించి నక్కావారిపేటలో కాలనీవాసులతో చర్చించారు.

సీసీ రోడ్ల నిర్మాణంలో అవకతవకలపై ఫిర్యాదు

ఐ.పోలవరం: పాత ఇంజరంలో సీసీ రోడ్ల నిర్మాణంలో అవినీతి, అక్రమాలు జరుగుతున్నాయని, నాణ్యతా ప్రమాణాలు పాటించడం లేదని గ్రామానికి చెందిన కొండేపూడి వెంకట్రావు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఫిర్యాదు కాపీని సోమవారం స్థానిక విలేకరులకు అందజేశాడు. గ్రామంలో రూ.ఆరు లక్షలతో చేపట్టిన మూడు సీసీ రోడ్ల నిర్మాణంలో కాంట్రాక్టర్ కనీస నియమ నిబంధనలు పాటించలేదన్నారు. దీనిపై విచారణకు ఆదేశించి కాంట్రాక్టర్ అక్రమాలను అడ్డుకోవాలని ఆయన కోరారు.

అలరించిన అన్నమాచార్య సంకీర్తనలు

అమలాపురం టౌన్: పద కవితా పితామహుడు అన్నమాచార్య జయంతి సందర్భంగా స్థానిక భూపయ్య అగ్రహారంలోని సీతారామచంద్రస్వామి దేవస్థాన ప్రాంగణంలో ఆర్ట్ ఫ్యామిలీ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. అన్నమయ్య సంకీర్తన చూడామణి బిరుదాంకిత ఎస్‌సీ శ్రీదేవి అన్నమయ్య సప్త సంకీర్తనలు రాగయుక్తంగా ఆలపించి రంజింప చేశారు. ఈ సందర్భంగా శ్రీదేవి మాట్లాడుతూ భక్తులకు అన్నమయ్య జీవిత చరిత్రను, కవితా వైభవాన్ని, సంకీర్తనల కీర్తిని వివరించారు. శ్రీదేవి ఆలపించిన కీర్తనలకు మిగిలిన మహిళలు కోరస్ పలికి అలరించారు. ఆర్ట్ ఫ్యామిలీ అధ్యక్షురాలు టి.సౌమ్యలక్ష్మి అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో పేరి సత్యవాణి, ఆంద్ర ఉషారాణి, కొత్తూరి బాల, శిష్టా శ్రీహరి, సంస్కార భారతి ప్రాంత ప్రాచీన కళా ప్రముఖ్ పుత్సా కృష్ణ కామేశ్వర్ పాల్గొన్నారు.

విద్య ద్వారానే సమాజంలో అసమానతలు దూరం

ముమ్మిడివరం: విద్య ద్వారానే సమాజంలో అసమానతలు రూపుమాపవచ్చునని ప్రతి ఒక్కరూ విద్యనభ్యసించాలని అమలాపురం ఎంపీ గంటి హరీష్‌మాధుర్, ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు పేర్కొన్నారు. ముమ్మిడివరంలో సోమవారం డా.బీఆర్ అంబేడ్కర్ జయంత్యుత్సవాలను ఘనంగా నిర్వహించారు. తొలిత స్థానిక పల్లిపాలెం సెంటర్ నుంచి అంబేడ్కరీయులు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం పోలమ్మ చెరువు వద్ద గల అంబేడ్కర్ నిలువెత్తు శిలా విగ్రహానికి పలువురు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా స్థానిక అంబేడ్కర్ కన్వెన్షన్ హాల్‌లో నగర పంచాయతీ చైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఎంపీ హరీష్‌మాధుర్, ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు మాట్లాడుతూ అంబేడ్కర్ ఆలోచన విధానాన్ని ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలన్నారు. మాజీ ఎమ్మెల్యే చెల్లి వివేకానంద, చెల్లి అశోక్, జనిపెల్ల సత్యనారాయణ, ఎం.ఆశీర్వాదం, కాశి బాలమునికుమారి, కాశి జగపతి రావు, పి.రజని, వడ్డి నాగేశ్వరరావు, అంబేడ్కరీయులు పాల్గొన్నారు.

సెంటాక్ ఇన్‌ఫర్మేషన్ బ్రోచర్ విడుదల

యానాం: 2025–26 విద్యా సంవత్సరంలో పుదుచ్చేరి, యానాం, మాహే, కారైకల్‌లోని అన్ని కళాశాలల్లో యూజీ నాన్ నీట్ విద్యాకోర్సుల్లో 10,577 సీట్లకు అడ్మిషన్ల కోసం నిర్వహించే సెంట్రలైజ్డ్ అడ్మిషన్ కమిటీ (సీఈఎన్‌టీఏసీ) ఇన్ఫర్మేషన్ బ్రోచర్‌ను సోమవారం సీఎం రంగసామి ఆవిష్కరించారు. అనంతరం అధికారులు మాట్లాడుతూ బ్రోచర్ సమాచారమంతా డబ్ల్యూ.డబ్ల్యూ.డబ్ల్యూ.సెంటాక్ పుదుచ్చేరి.ఇన్ వెబ్‌సైట్‌లో ఉంటుందని అభ్యర్థులు తమ దరఖాస్తులను ఆన్‌లైన్ ద్వారా పంపాలని తెలిపారు. ఇతర సమాచారం కోసం వెబ్‌సైట్‌ను సందర్శించాలని కోరారు. అభ్యర్థుల అనుమానాలను నివృత్తి చేసేలా గ్రీవెన్స్ ఆప్షన్ ఉందన్నారు. నాన్ నీట్ కోర్సుల వివరాలు, ఇంజనీరింగ్, ఆర్కిటెక్చర్, బయోలజీ బేస్డ్ డిగ్రీ, డిప్లొమా కోర్సులు, లా అండ్ ఒకేషనల్, ఆర్ట్స్ అండ్ సైన్స్, కామర్స్, పెర్‌ఫార్మింగ్ ఆర్ట్స్ అండ్ ఫైన్ ఆర్ట్స్ కోర్సుల వివరాలను పొందుపరిచినట్లు తెలిపారు. ఆన్‌లైన్ దరఖాస్తుల ప్రారంభ తేదీలను త్వరలోనే ప్రకటిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో సెంటాక్ అధికారులు, అధ్యాపకులు, పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.